క్లుప్తంగా

సంక్షేమం, అభివృద్ధిలో సువర్ణాధ్యాయం


ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిలో సువర్ణ అధ్యాయం నడుస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ చక్కటి ఆయురారోగ్యాలను, సుఖసంతోషాలను, భోగభాగ్యాలను, అష్టైశ్వర్యాలు పొందాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గ ప్రజలందరికీ 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే దేవాలయాలు

పెదవేగి : గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే దేవాలయాలని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి గ్రంధపఠనం చేశారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథపఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందని అరుణ్‌కుమార్ తెలిపారు.

వాడవాడలా నూతన సంవత్సర సందడి

- కళలాడుతున్న దుకాణాలు
- యువత సందడి


రంగవల్లిని తీర్చిదిద్దుతున్న చిన్నారులు


సరికొత్త హంగులతో సిద్ధంగా పుష్పగుచ్ఛాలు

పెదవేగి : నూతన సంవత్సరానికి ఘనంగా ఆహ్వానం పలికేందుకు అన్ని రంగాల వారు ముఖ్యంగా యువతీ, యువకులు సిద్ధమయ్యారు. న్యూఇయర్ శోభతో గ్రామాల్లోని దుస్తులు, ఫ్యాన్సీ, సెల్ దుకాణాలు, స్వీట్లు, పూలు, పండ్ల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఆకర్షణీయమైన డిజైన్లలో గ్రీటింగ్ కార్డులు, పుష్పగుచ్ఛాలు, కేక్‌లు, గిఫ్ట్ ప్యాక్‌లు, బొకేలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకల సందడి నెలకొంది. సాంకేతిక అభివృద్ధి ముఖ్యంగా ఇంటర్ నెట్, ఈ మెయిల్, యూట్యూబ్, వాట్సాప్‌ల ద్వారా అనేక మంది శుభాకాంక్షలు తెలుపుతున్నారు.నూతన సంవత్సరాన్ని దైవ సన్నిధిలో గడిపేందుకు ప్రజలంతా ఆలయాలకు, చర్చిలకు వెళ్లేందుకు సన్నద్ధమయ్యారు. మండలంలోని వేగివాడ, విజయరాయి, పెదవేగి, దుగ్గిరాల, కొప్పాక, పినకడిమి, జానంపేట, ఆర్‌సీఎం దేవాలయాలు సరికొత్త రంగులు, వివిధ రకాల విద్యుత్ దీపాల అలంకరణతో ఆకర్షిస్తున్నాయి.

న్యూ ఇయర్‌లో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: న్యూ ఇయర్‌లో నియోజవర్గ ప్రజలు, ఉద్యోగులు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. క్యాంపు కార్యాలయం భువనపల్లిలో ఆదివారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా పీఆర్‌టీయూ మండల శాఖ రూపొందించిన 2024 న్యూ ఇయర్ క్యాలెండర్లను వాసుబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు ఉపాధ్యాయ సంఘాలు వారధిగా ఉండాలని, రాష్ట్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరి ఆశీస్సులు ఉండాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి వేలాది కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మండే సుధాకర్, జిల్లా కార్యదర్శి కేఎంజీ పుల్లారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి


నూతనంగా నియమితులైన నాలుగు మండలాల యువజన అధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షులు వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టి ప్రణాళికతో కృషి చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం దెందులూరు నియోజకవర్గంలో నాలుగు మండలాలకు నూతనంగా నియమితులైన యువజన విభాగ అధ్యక్షులు, నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. దెందులూరు మండల అధ్యక్షుడు గొరిపర్తి శ్రీనివాస్, పెదపాడు మండల గోరింకల జగదీష్, ఏలూరు రూరల్ శేష్ కుమార్, పెదవేగి చిట్టిబొమ్మ రంగారావు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిశారు. వారిని ఎమ్మెల్యే అభినందించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.

నాగమణి బుద్ధదేవ్‌కు పురస్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్య గురు ఎ.నాగమణి బుద్ధదేవ్ బెంగళూరులో పురస్కారం అందుకున్నారు. కర్ణాటకలోని శ్రీ రాజరాజేశ్వరి సాంస్కృతిక కళా సంస్థ నవసంధి ఆలయ సంప్రదాయ నృత్య ప్రదర్శనలో భాగంగా నాగమణి బుద్ధదేవ్ నృత్య రంగానికి చేసిన విశిష్ట సేవలకు ఆమెకు ఆత్మీయ గౌరవ సత్కార్ పురస్కారానికి ఎంపిక చేసింది. శనివారం బెంగళూరులోని చౌడప్ప మెమోరియల్ హాల్‌లో పలువురు ప్రముఖులు నాగమణి బుద్ధదేవ్‌కు పురస్కారం ప్రదానం చేశారు.

నిబంధనలు పాటించాలి

భీమడోలు: నూతన సంవత్సర వేడుకలను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకుంటూ నిబంధనలను పాటించి పోలీసులకు సహకరించాలని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ ఆదివారం రాత్రి తెలిపారు. వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు, మ్యూజిక్ సిస్టంలు, ఉపయోగించే తరుణంలో విధిగా ముందుస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని తనిఖీ చేస్తామన్నారు. వాహనాలను సీజ్ చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చుతామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో లిక్కర్ సేవించడం పేకాట ఆడడం నిషేధమన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాత్రి 10 గంటలకు తర్వాత ఎటువంటి మ్యూజిక్ సిస్టమ్‌ను వాడవద్దన్నారు. ఆకతాయిలు, మితిమీరి ప్రవర్తించే యువతను, రోడ్డును చిందులు తొక్కే మందుబాబులను ఇష్టానుసారంగా వాహనాలను నడిపే వారిని చిత్రీకరించేందుకు వీడియో కెమెరాలను, డిజిటల్ కెమెరాలను ఉపయోగిస్తున్నామన్నారు. చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. విధిగా హెల్మెట్లను వాడాలని, మైనర్లు వాహనాలు నడపవద్దని సూచించారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయంలో వార్షికోత్సవం

దెందులూరు: కోస్తా జిల్లాలో కొలిచిన వారింట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దెందులూరు మండలం గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ 67వ వార్షికోత్సవ ఉత్సవాలు ఫిబ్రవరి 16 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తారని గాలాయగూడెం అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఉత్సవ కమిటీ తెలిపింది. ఆదివారం ఆలయ ఆవరణలో ఉత్సవాల నిర్వహణకు సంబంధించి కమిటీ సమావేశం నిర్వహించి తేదీలను ఖరారు చేసింది. ఉత్సవాలకు వచ్చే భక్తులు జంగారెడ్డిగూడెం రూట్‌లో వీఆర్వో విష్ణు ఇంటి నుంచి నేరుగా అమ్మవారి ఆలయానికి వచ్చేలా దాతలు గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతుల ఆర్థిక సాయంతో రోడ్డు నిర్మించామన్నారు. ఇకపై భక్తులు ఎటువంటి మలుపులు తిరగకుండా గాలాయగూడెం రాగానే మొదటి రోడ్డులో నుంచే నేరుగా అమ్మవారి ఆలయానికి రావచ్చని తెలిపారు.

అంగన్‌వాడీల నిరసన

పెదవేగి : రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 12వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పెదవేగి మండల కేంద్రంలో 2023 సంవత్సరం ముగింపులో తమ సమస్యలు పరిష్కారం అవ్వాలని కోరుతూ ఆదివారం నిరసన తెలిపారు. ఈ ధర్నా శిబిరంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు జె గోపి, పి ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి వి బేబీ రాణి, టీ నాగమణి కే నిర్మల తదితరులు నాయకత్వం వహించారు.

చేపల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఏలూరు (టూటౌన్): చేపల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఫంగస్ చేపలు సాగు చేస్తున్న రైతులు గత రెండేళ్లుగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లీజులు, మేతలు, మందులు ధరలు విపరీతంగా పెరిగిపోయాయని చెప్పారు. పెట్టుబడికి అనుగుణంగా రైతులకు ధర రావడం లేదన్నారు. ఫంగస్ చేపల ఎగుమతులు కూడా భారీగా తగ్గిపోయాయని చెప్పారు. ఫంగస్ ఇతర చేపలు సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు.

కోమటిలంకలో కోడి పందేలు

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామంలో ఆదివారం కోడి పందేలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో కొందరు వ్యక్తులు కోడి పందేలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకుని కైకులూరు నుంచి పెద్ద ఎత్తున పందెంరాయుళ్లు కోళ్ళు పట్టుకుని గ్రామానికి చేరుకున్నారు. దీంతో కోడి పందేలు విషయం బయటకు తెలిసిపోతుందని భావించి, నిర్వాహకులు గ్రామ శివారున 50 ఎకరాల చెరువు వద్దకు బరి మార్చారు. సాయంత్రం 4 గంటల వరకూ లక్షల రూపాయల్లో పందేలు కొనసాగాయి. గ్రామానికి ఉన్న ఒకే ఒక్క పడవ మార్గం ద్వారా పందెంగాళ్ళు పెద్ద ఎత్తున గ్రామానికి రాకపోకలు సాగించడంతో గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జూద క్రీడలపై నిషేధాజ్ఞలు

ఏలూరు(మెట్రో): ప్రజలందరూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల ప్రకారం ఏలూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కోడి పందేలు, జూదం, గుండాట ఆడటంపై నిషేధం ఉన్నందున, ఆదేశాలను ఉల్లంగించిన వారిపై, వారికి సహకరించిన వారిపైనా చర్యలు తీసుకోనున్నట్లు ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి సంపాదించిన సంపాదనను వృధా చేయకుండా సంక్రాంతి పండుగను బంధువులు, కుటుంబ సభ్యులతో జరుపుకోవాల్సిందిగా ఆర్డీవో కోరారు. నిషేదాజ్ఞలు మీరి కోడి పందేలు, జూదం, గుండాట తదితర జూదక్రీడలు ఆడటం, నిర్వహణ, ప్రోత్సహించడం చేస్తే తీవ్రమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. జూదం నిర్వహిస్తే సమాచారం అధికారులకు తెలపాలని ఆయన అన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వాసుబాబు పుట్టినరోజు వేడుక


కేకు కోస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు. చిత్రంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీచైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, టీటీడీ సభ్యుడు సుబ్బరాజు

గణపవరం/ఉంగుటూరు/భీమడోలు: ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు 56వ పుట్టినరోజు వేడుకలు ఆదివారం బువ్వనపల్లి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు భారీగా తరలి వచ్చి వాసుబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వాసుబాబు కోరిక మేరకు పూల దండలు, బొకేలు, జ్ఞాపికలకు బదులుగా విద్యార్థులకు ఉపయోగపడే విద్యాసామగ్రిని బహుమతిగా వాసుబాబుకు అందజేశారు. పలు గ్రామాల నుంచి పార్టీ నాయకులు కేకులు తీసుకువచ్చి వాసుబాబుతో కోయించారు. నిడమర్రు జెడ్పీటిసి సభ్యుడు కోడే కాశి ఎమ్మెల్యే వాసుబాబును భారీ గజమాల, పూలకిరీటంతో సత్కరించారు. 100 కిలోల భారీ కేకును దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, జెడ్పీచైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, టీటీడీ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు, ఉండి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పీవీఎల్ నర్సింహరాజు సమక్షంలో వాసుబాబుతో కట్ చేయించారు. నాలుగు మండలాల ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, గంటా శ్రీలక్ష్మి, కనుమాల రామయ్య, జెడ్పీటీసీలు దేవారపు సోమలక్ష్మి, కోడే కాశీ, కొరిపల్లి జయలక్ష్మి, తుమ్మగుంట రంగా, ఏఎంసీ ఛైర్మన్లు మరడ రమావతి, ఇంజేటి నీలిమ, మండల పార్టీ కన్వీనర్లు దండు రాము, సంకు సత్య కుమార్, మరడ మంగారావు, రావిపాటి సత్య శ్రీనివాస్, ఎమ్మెల్యే సోదరులు పుప్పాల చినబాబు, కన్నబాబు, కార్తీక్, జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, డీపీవో టి.విశ్వనాథ్, సొసైటీ ఛైర్మన్లు, ఆర్‌బీకే, దేవస్థానం ఛైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులకు ఎమ్మెల్యే వాసుబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు అందజేసిన విద్యాసామగ్రిని త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే వాసుబాబుకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు

ఉంగుటూరు మండల అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీటీసీలు బండారు నాగరాజు, పెనుగొండ బాలకృష్ణ, తప్పెట్ల వరలక్ష్మి, దేవదాసు విజయనిర్మల, రాయిలక్ష్మి, సర్పంచ్‌లు మిద్దే సత్యవతి, విష్ణు, మైనార్టీ సెల్ నేత సయ్యద్ బాజి, ఆర్‌బీకే ఛైర్మన్ తల్లాప్రగడ శివరామ్, సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి, మాజీ సర్పంచి కరణం బుజ్జి, యువజన సంఘం అధ్యక్షుడు ఆకులరాజు, పుప్పాల గోపి వాసుబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. భీమడోలు, పోలసానిపల్లి, పూళ్ల, గుండుగొలను, కొల్లేరు గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, పలువురు సచివాలయ ఉద్యోగులు బువ్వనపల్లి వెళ్లి ఎమ్మెల్యే వాసుబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ప్రజాప్రతినిధులు


కొల్లేరు వాసులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

సేవాభావంతో మెలగాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలుగుతూ సమాజంలోని సాటి వారికి సహాయం చేయాలని వ్యాపారవేత్త నారా శేషు సూచించారు. ఆదివారం రాత్రి స్థానిక జ్యూట్‌మిల్ వద్ద ఉన్న ధర్మ భేరి ప్రాంగణంలో క్రిస్మస్ వేడుకల ముగింపు, నూతన సంవత్సర ప్రారంభ వేడుకలు హోటల్ ఎస్ గ్రూప్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేదవారిని ఆదుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ మానవత్వాన్ని నిరూపించుకోవాలన్నారు. మానవ జన్మను సార్థకం చేసుకుంటూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలకు తెగించి వైరస్ సోకినవారికి చికిత్స అందించిన నర్సుల త్యాగం మరువరానిదన్నారు. అటువంటి వారిని గుర్తించి వారికి సమాజంలో సముచిత గౌరవం కల్పించాలనే లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యాన 100 మంది నర్సులను సన్మానిస్తున్నామన్నారు.